ప్రభాత
ఉదయం
తెలుగు దినపత్రిక

**రిపోర్టర్లు కావలెను**

అత్యంత ప్రజాదరణ పొందిన ప్రభాత ఉదయం
తెలుగు దినపత్రికలో పనిచేయుటకు తెలంగాణ వ్యాప్తంగా
జిల్లా, మండల మరియు నియోజకవర్గాల వారీగా
రిపోర్టర్లు కావలెను.

ఉదయం
సంప్రదించండి
ఫోన్: 93910 89608

సంపుటి: 2 | సంచిక: 246 | పేజీలు: 4 | వెల: రూ.3/- | గురువారం 12 డిసెంబర్ 2024 | ఎడిటర్: కోట్ల చంద్రకాంత్

# కాంగ్రెస్ సర్కార్ వల్ల
# అన్నదాతల అరిగోస



- ఆడబిడ్డల నుంచి ప్రతివర్గం అరిగోస పడుతోంది
- చేతగానీ ముఖ్యమంత్రిని తెలంగాణపై రుద్దారు
- ప్రగతి పథంలో పరుగులు పెట్టిన రాష్ట్రం అధోగతిపాలు
- మీ తీరు చూసి రాష్ట్ర ప్రజలు నిత్యం రగిలిపోతున్నారు
- సీఎం ఢిల్లీకి పంపించే మూటలపై మీకున్న శ్రద్ధ..
- ప్రజలకు మీరిచ్చిన మాటలపై శ్రద్ధ లేదా?
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శలు
- రాహుల్ గాంధీకి కేటీఆర్ బహిరంగ లేఖ

**హైదరాబాద్, డిసెంబర్ 11 (ప్రభాత ఉదయం):** చేతి గుర్తుకు ఓటేస్తే చేతగానీ ముఖ్యమంత్రిని తెలంగాణపై రుద్దారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. కాంగ్రెస్ సర్కార్ వల్ల అన్నదాతల నుంచి ఆడబిడ్డల దాకా ప్రతివర్గం అరిగోస పడుతోందని అన్నారు. ప్రగతి పథంలో పరుగులు పెట్టిన రాష్ట్రం అధోగతి పాలవుతుంటే తెలంగాణ వైపు కన్నెత్తి చూడని మీ తీరును చూసి నాలుగు కోట్ల ప్రజలు నిత్యం రగిలిపోతున్నారని మండిపడ్డారు. సీఎం ఢిల్లీకి పంపించే మూటలపై మీకున్న శ్రద్ధ.. ప్రజలకు మీరిచ్చిన మాటలపై శ్రద్ధ లేదా అని ప్రశ్నించారు. ఈ మేరకు కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీకి కేటీఆర్ బహిరంగ లేఖ రాశారు. కాంగ్రెస్ ఏడాది పాలనలో ఏ పేజీ తిప్పి చూసినా.. మోసం మీ నైజం.. అవినీతి మీ ఎజెండా, నియంతృత్వం మీ విధానమని అడుగడుగునా తేల్చి చెప్పారని కేటీఆర్ అన్నారు. మనసులో విషం తప్ప మెదడులో విషయం లేని సీఎం చేతిలో ..మిగతా 2లో





## రాజీవ్ సివిల్స్ అభయ హస్తం సాయం

**యూపీఎస్సీ మెయిన్స్ లో 20 మంది ఉత్తీర్ణత**

**మెయిన్స్‌లో ఉత్తీర్ణులకు సీఎం రేవంత్ రెడ్డి అభినందనలు**

**హైదరాబాద్, డిసెంబర్ 11 (ప్రభాత ఉదయం):** యూపీఎస్సీ సివిల్స్ మెయిన్స్-2024 పరీక్ష ఫలితాల్లో తెలంగాణ అభ్యర్థులు సత్తా చాటారు. ఈ ఏడాది మొదటిసారిగా రాష్ట్రం నుంచి సివిల్స్ మెయిన్స్ పరీక్షలకు హాజరైన అభ్యర్థులకు ప్రభుత్వం ఆర్థిక సాయం అందించింది. సివిల్స్?కు ప్రిపేర్ అవుతున్న పేద కుటుంబీకులకు అండగా నిలిచేందుకు రాజీవ్ సివిల్స్ అభయ హస్తం పథకాన్ని తెలంగాణ ప్రభుత్వం అమలు చేసింది. సింగరేణి సంస్థ ఆధ్వర్యంలో 135 మందికి రూ. లక్ష చొప్పున ఆర్థిక సాయం అందించింది. ఈ ఏడాది ఆగస్ట్ 26న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సివిల్స్ అభ్యర్థులకు చెక్కులు పంపిణీ చేశారు. రాజీవ్ సివిల్స్ అభయ హస్తం సాయం అందుకున్న అభ్యర్థుల్లో 20 మంది యూపీఎస్సీ సివిల్స్ మెయిన్స్? ఫలితాల్లో విజేతలుగా నిలిచారు. వరంగల్ అర్బన్ జిల్లాకు చెందిన ఈ. సాయి శివాని, రాహుల్ శంకేషి, పోతరాజు హరి ప్రసాద్, విక్రమ్ బేతి, ఖమ్మం జిల్లాకు చెందిన నల్లమల సాయికుమార్ , బానోతు నాగ రాజా నాయక్, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాకు చెందిన ..మిగతా 2లో

## కేటీఆర్ ఆశల పల్లకిలో ఉన్నారు

**అధికారం వస్తుందని పగటి కలలు కంటున్నారు**

**బీఆర్ఎస్ మానసికస్థితి ఏమిటో తెలుస్తోంది**

**తెలంగాణ తల్లి విషయంలో కావాలని రాజకీయం**

**కేటీఆర్ వ్యాఖ్యలపై మంత్రి శ్రీధర్ బాబు విమర్శలు**



**హైదరాబాద్, డిసెంబర్ 11 (ప్రభాత ఉదయం):** ఎమ్మెల్యేలు, ఎమ్మెల్యేల శిక్షణా తరగతులకు వెళ్లవద్దని కేటీఆర్ తన పార్టీ ఎమ్మెల్యేలకు పిలుపునిచ్చారని, దీంతో బీఆర్ఎస్ మానసిక స్థితి ఏమిటో తెలుస్తోందని మంత్రి శ్రీధర్ బాబు విమర్శించారు. కొత్తగా ఎన్నికైన ఎమ్మెల్యేలకు ప్రభుత్వం శిక్షణా తరగతులను నిర్వహిస్తోంది. ఈ క్రమంలో శ్రీధర్ బాబు ఓ టీవీ ఛానల్‌తో మాట్లాడుతూ... ప్రతిపక్షం ప్రతి దానిని రాజకీయం చేయాలని చూస్తోందన్నారు. కేటీఆర్ ఆశల పల్లకిలో ఉన్నారని, అందుకే నాలుగేళ్లలో అధికారం వస్తుందని పగటి కలలు కంటున్నారని విమర్శించారు. ఇందిరాగాంధీ, రాజీవ్ గాంధీ విగ్రహాలను ఎవరూ తొలగించలేరన్నారు. ఎమ్మెల్యేల శిక్షణా తరగతులకు రావొద్దని కేటీఆర్ చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. మళ్లీ బీఆర్ఎస్ అధికారంలోకి వస్తుందా? అని ఎద్దేవా చేశారు. తెలంగాణ తల్లి విషయంలో కావాలని రాజకీయం చేస్తున్నారని ధ్వజమెత్తారు.

## అమెరికాతో అదానీ పోర్ట్స్ రుణ ఒప్పందం ఉపసంహరణ

**553 మిలియన్ డాలర్ల ఒప్పందం వెనక్కి**

న్యూఢిల్లీ, డిసెంబర్ 11 (ప్రభాత ఉదయం): అమెరికా ఇంటర్నేషనల్ డెవలప్‌మెంట్ ఫైనాన్స్ కార్పొరేషన్ (డీఎఫ్‌సీ)తో కుదుర్చుకున్న 553 మిలియన్ డాలర్ల ఒప్పందాన్ని భారత బిలియనీర్ అదానీకి చెందిన అదానీ పోర్ట్స్ అండ్ స్పెషల్ ఎకనమిక్ జోన్ (ఏపీఎస్ఈజడ్) లిమిటెడ్ ఉపసంహరించుకుంది. శ్రీలంక రాజధాని కొలంబోలో ఓడ రేవు అభివృద్ధికి గాను ఈ రుణం ఒప్పందం కుదుర్చుకుంది. అయితే, ఇప్పుడీ ఒప్పందం నుంచి వెనక్కి తగ్గినట్టు సోమవారం రాత్రి ఏపీఎస్ఈజడ్ ..మిగతా 2లో





## ముత్యాలమ్మ విగ్రహ పునఃప్రతిష్ఠ కార్యక్రమంలో పాల్గొన్న మంత్రులు

**హైదరాబాద్, డిసెంబర్ 11 (ప్రభాత ఉదయం):** సికింద్రాబాద్ కుమ్మరి గూడలోని శ్రీముత్యాలమ్మ గుడిలో అమ్మవారి పునఃప్రతిష్ఠ కార్యక్రమం అంగరంగ వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమానికి మంత్రి పొన్నం ప్రభాకర్, కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీ గణేష్, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నేతలు, దేవదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, బీజేపీ ఎంపీ ఈటెల రాజేందర్ హాజరై ప్రత్యేక పూజలు, హోమాలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. గతంలో సికింద్రాబాద్ ఆలయంలో జరిగిన సంఘటన దురదృష్టకరమని.. వెంటనే ప్రభుత్వం స్పందించి స్థానిక శాసన సభ్యుడి విజ్ఞప్తి మేరకు దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో విగ్రహ పునఃప్రతిష్ఠ చేయడం జరిగిందన్నారు. అమ్మవారి ఆశీస్సులు అందజేసే విధంగా వేద పండితులతో పునఃప్రతిష్ఠ చేసుకొని దేవదాయ శాఖ మంత్రి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించినట్లు ఆయన తెలిపారు. ఎక్కడైనా దేవాలయాలు, ప్రార్థన మందిరాల పట్ల రాజకీయం చేయడం మంచిది కాదని హితవు పలికారు. ఆ ముత్యాలమ్మ వారికి రెండు చేతులు జోడిరచి ప్రజలంతా సుఖ సంతోషాలతో.. ఆయు ఆరోగ్యాలతో ఉండాలని ప్రార్థించారు. దేవాలయాలను కాపాడుకోవాలి.. విద్రోహం జరిగినపుడు అందరం కలిసి ఎదుర్కోవాలి కానీ రాజకీయాలు తగదు అన్నారు. ప్రజల విశ్వాసం కాపాడేలా తమ ప్రభుత్వం ముందుకు సాగుతోందని ఈ సందర్భంగా తెలియజేశారు.అనంతరం ముత్యాలమ్మ ఆలయంలో మంత్రి కొండా సురేఖ కుటుంబ సమేతంగా పాల్గొన్నారు.

## గ్రూప్-2 పరీక్షలు యథాతథం

**వాయిదాకు హైకోర్టు నిరాకరణ**



**హైదరాబాద్, డిసెంబర్ 11 (ప్రభాత ఉదయం):** తెలంగాణ గ్రూప్ 2 పరీక్షలు మరో నాలుగు రోజుల్లో జరగనున్నాయి. ఈ క్రమంలో ఇప్పటికే హాల్ టికెట్లు కూడా టీజీపీఎస్సీ విడుదల చేసింది. అయితే గ్రూప్ 2 పరీక్ష వాయిదా వేయాలని కోరుతూ కొందరు అభ్యర్థులు హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేసిన సంగతి తెలిసిందే. వీటిని సోమవారం విచారించిన హైకోర్టు వాయిదాను తిరస్కరించింది. డిసెంబరు 15, 16 తేదీల్లో జరగనున్న పరీక్షలకు ఇప్పటికే ఏర్పాట్లన్నీ పూర్తయ్యాయని, ఈ పరిస్థితుల్లో జోక్యం చేసుకోలేమని స్పష్టం చేసింది. కాగా డిసెంబరు 16న రైల్వే రిక్రూట్‌మెంట్ బోర్డు (ఆర్ఆర్‌బీ) పరీక్షలున్నందున గ్రూప్ 2ను వాయిదా వేయాలని కోరుతూ టీజీపీఎస్సీకి ఇచ్చిన వినతిపత్రంపై స్పందించకపోవడాన్ని సవాలు చేస్తూ ఆర్.జ్యోతి అనే అభ్యర్థితో పాటు వివిధ జిల్లాలకు చెందిన సుమారు 22 మంది అభ్యర్థులు హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. దీనిపై విచారణ చేపట్టిన జస్టిస్ పుల్లా కార్తీక్ ఇరు పక్షాల వాదనలు విన్నారు. పిటిషనర్ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ ..మిగతా 2లో

## విమానాశ్రయాల అభివృద్ధికి మోదీ ప్రభుత్వం కృషి

**2026 జూన్ నాటికి భోగాపురం విమానాశ్రయం పూర్తి**

**మరో పదేళ్లలో దేశంలో 50 ఎయిర్ పోర్టులు**

**కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు వెల్లడి**

2





# కాంగ్రెస్ సర్కార్ వల్ల అన్నదాతల అరిగోస

మొదటి పేజీ తరువాయి...

తెలంగాణ బతుకు ఛిద్రమవుతుంటే ప్రేక్షక పాత్రే వహిస్తారా అని మండిపడ్డారు. ప్రశ్నిస్తే కేసులు, నిలదీస్తే అరెస్టులు అన్నట్లుగా సాగుతున్న మీ పాలన తీరు ఎమర్జెన్సీ రోజులను తలపిస్తోందని తెలిపారు. ఇందిరమ్మ రాజ్యం అంటే ఇంటింటా నిర్బంధం, సకల రంగాల్లో సంక్షోభమేనని ఈ ఏడాది పాలన రుజువు చేసిందని విమర్శించారు. గత పదేళ్లలో తాము తెలంగాణ పునర్నిర్మాణంపైనే దృష్టి పెట్టాం తప్ప.. పనికిమాలిన ఆలోచనలు చేయలేదని తెలిపారు. రాజీవ్ ఆరోగ్యశ్రీని, రాజీవ్ ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్టు పేర్లు మార్చలేదు, ఇందిరాగాంధీ విగ్రహాల జోలికి వెళ్లలేదు. కానీ మనసులో విషం తప్ప మెదడులో విషయం లేని సీఎం రేవంత్ రెడ్డి తెలంగాణ అస్తిత్వ ఆనవాళ్లను చెరిపేసే దారుణ కుట్రకు తెరలేపాడని మండిపడ్డారు. సీఎం రేవంత్ చేసిన ఈ నీచమైన, కుటిల చర్యలకు ప్రతిస్పందనగా భవిష్యత్తులో కాంగ్రెస్ పార్టీ గుర్తులు తెలంగాణలో చెరగడం ఖాయం అని గుర్తుంచుకోవాలని హెచ్చరించారు..సరిగ్గా ఏడాది క్రితం కొలువుదీరిన మీ కాంగ్రెస్ సర్కారు తెలంగాణను ఆగం చేయడమే కాకుండా తెలంగాణ అస్థిత్వాన్ని కూడా దెబ్బతీస్తోంది. చేతకాని, మతిలేని ముఖ్యమంత్రిని తెలంగాణ నెత్తిన రుద్ది మీరు చేతులు దులుపుకోవడంతో అన్నదాతల నుంచి ఆడబిడ్డల దాకా ప్రతివర్గం అరిగోస పడుతోంది. వ్యవసాయ రంగం నుంచి పారిశ్రామిక వర్గం దాకా సంక్షోభంలో కూరుకుపోతోంది. ఎన్నికల టైంలో మీరు ఊరురా తిరిగి ఊదరగొట్టిన గ్యారెంటీలన్నీ గారడీలేనని మీ ఏడాది పాలన చూస్తే అర్థమైపోయింది. మీరు చేసిన డిక్లరేషన్ల పట్ల మీకే డెడికేషన్ లేదని అక్షరాలా రుజువైపోయింది. మేనిఫెస్టోలో మీరిచ్చిన 420 హామీలు.. కాంగ్రెస్ చీటింగ్ చాప్టర్ లో భాగమేనని తెలంగాణ సమాజానికి తెలిసిపోయింది. గాలి మోటర్లో వచ్చి గాలిమాటలు చెప్పి ఏడాదిపాటు పత్తా లేకుండా పోయిన మీకు, మీ పార్టీకి తెలంగాణ పట్ల రవ్వంత కూడా బాధ్యత లేదని తేలిపోయింది. ప్రగతి పథంలో పరుగులు పెట్టిన రాష్ట్రం అధోగతి పాలవుతుంటే తెలంగాణ వైపు కనీసం కన్నెత్తి చూడని మీ తీరును చూసి నాలుగు కోట్ల ప్రజలు నిత్యం రగిలిపోతున్నారు. సీఎం ఢిల్లీకి పంపే మూటలపై మీకున్న శ్రద్ధ, మీరు ప్రజలకు మీరిచ్చిన మాటపై లేకపోవడం నయవంచన, ద్రోహం కాక మరేంటి. ఏడాది పాలనలో ఏ పేజీ తిప్పి చూసినా.. మోసం మీ నైజం.. అవినీతి మీ ఎజెండా, నియంతృత్వం మీ విధానమని అడుగడుగునా తేల్చిచెప్పారు. మనసులో విషం తప్ప మెదడులో విషయం లేని సీఎం చేతిలో తెలంగాణ బతుకుచిత్రం ఛిద్రమవుతుంటే మీరు ప్రేక్షకపాత్రకే పరిమితమైన వ్యవహారంపై ఆదిలాబాద్ నుంచి అలంపూర్ వరకూ ప్రజాగ్రహం వెల్లువెత్తుతోంది. దేశానికే వెన్నుముక అయిన రైతన్నకు వెన్నుపోటు పొడిచిన దుర్మార్గపు పాలన మీది. కాంగ్రెస్ కు అధికారమిస్తే ఏక కాలంలో రైతులందరికీ డిసెంబర్ 9న 2 లక్షల రుణమాఫీ చేస్తామని ఇచ్చిన మాట నీటిమూటే అయ్యింది. రుణమాఫీకి రూ.49,500 కోట్లు అవసరమైతే తూతూమంత్రంగా చేసి చేతులు దులుపుకున్నారు. అది కూడా నాలుగు విడతలుగా ఊరించి ఊరించి ఉసూరుమనిపించడంతో.. ఇప్పటికే దాదాపు 620 మంది రైతులు తెలంగాణలో ఆత్మహత్యలు చేసుకున్నారు. అయినప్పటికీ ముఖ్యమంత్రిలో చలనం లేదు.. కాంగ్రెస్ సర్కారులో కనీస మానవత్వం లేదు. బీఆర్ఎస్ హయాంలో అప్రతిహతంగా కొనసాగిన పెట్టుబడి సాయానికి కాంగ్రెస్ రాగానే బ్రేకులు వేశారు. బీఆర్ఎస్ సిద్ధం చేసిన రైతుబంధు నిధులను ఒకసారి విడుదల చేశారే తప్ప.. ఏడాద్కెనా మీరు చెప్పిన రైతుభరోసాను అసలు మొదలే పెట్టలేదు. వానాకాలం సీజన్ లో పెట్టుబడి సాయాన్ని మొత్తానికే ఎగ్గొట్టి రైతాంగాన్ని నిలువునా ముంచారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే, కౌలు రైతులకు కూడా రైతుభరోసా కింద 15 వేలు, రైతు కూలీలకు 12 వేల చొప్పున ఇస్తామన్న హామీకి ఏడాద్కెనా అతీ గతీ లేదు. ఎన్నికల ప్రచారంలో వడ్లకు రూ.500 బోనస్ ఇస్తామని నమ్మబలికి, తీరా గద్దెనెక్కాక సన్న వడ్లకు మాత్రమే అని సన్నాయి నొక్కులు నొక్కిన మీ సన్నాసి ప్రభుత్వ నిజస్వరూపాన్ని రైతులు అర్థం చేసుకున్నారు. కాంగ్రెస్ ను నమ్మితే రైతుకు గోస తప్ప భరోసా లేదని తొలి ఏడాది పాలనలోనే తేల్చి చెప్పారు. బోనస్ మాట దేవుడెరుగు కనీసం పంట కొనుగోలు కేంద్రాలు, మద్దతు ధర లేక "సాగు" మళ్లీ సంక్షోభంలో కూరుకుపోయింది. విత్తనాలు, ఎరువుల కోసం మళ్లీ క్యూలైన్లో చెప్పులు, పాసు పుస్తకాలు పెట్టే దుస్థితి తెచ్చిన కాంగ్రెస్ సర్కారును చూసి అన్నదాతలు అసహ్యించుకుంటున్నారు. అధికారంలోకి వచ్చిన తొలి ఏడాదిలోనే జాబ్ క్యాలెండర్ వేసి.. 2 లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని మీరిచ్చిన హామీ గంగలో కలిసిపోయింది. ఈ ఏడాదిలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక భర్తీ చేసిన ఉద్యోగాలు కేవలం 12,527 మాత్రమే. అంటే తెలంగాణ యువతకు మీ కాంగ్రెస్ ప్రభుత్వం అక్షరాలా 1,87,473 ఉద్యోగాలు బాకీ ఉందనే విషయాన్ని తెలంగాణ యువత మరిచిపోలేదు. యువతకు ఇస్తామన్న 10 లక్షల వడ్డీ లేని రుణాలు ఏమయ్యాయని తెలంగాణ సమాజం మిమ్మల్ని సూటిగా ప్రశ్నిస్తోంది. ఇక అశోక్ నగర్ లో నిరుద్యోగులతో ఫోటోలకు ఫోజులుకొట్టి అడ్రస్ లేకుండా పోయిన మీరు కూడా కాంగ్రెస్ చేసిన మోసంలో భాగస్వాములేనని యువత బలంగా నమ్ముతోంది. ఎన్నికల ప్రచారంలో ఆడబిడ్డలకు అరచేతిలో వైకుంఠం చూపించి నిలువునా మోసం చేశారు. అరకొరగా నడిచిన ఫ్రీ బస్సు స్కీమ్ తప్ప మహిళలకు ఒరిగిన ప్రయోజనం ఒక్కటీ లేదు. 18 ఏళ్లు నిండిన ప్రతి ఆడబిడ్డకు నెలకు రూ .2500 హామీకి 365 రోజులు గడిచినా మోక్షం లేదు. నయా పైసా ఇచ్చే దిక్కులేదు కానీ.. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేస్తామని మీ ఢిల్లీ పార్టీ చేసిన ప్రకటనలోని డొల్లతనాన్ని తెలంగాణ ఆడబిడ్డలు పసిగట్టేశారు. కల్యాణలక్ష్మి పథకానికి తోడు తులం బంగారం ఇస్తామని మభ్యపెట్టి.. చివరికి అసలు పథకానికి కూడా ఎసరు పెట్టిన దగుల్బాజీ పాలన మీది. ఏడాది కాలంగా కల్యాణలక్ష్మి సాయం అందని పేద తల్లిదండ్రులు కాంగ్రెస్ కు శాపనార్థాలు పెడుతున్నారు. వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలకు ఇచ్చే పెన్షన్లను 4 వేలకు పెంచుతామని, దివ్యాంగుల పించన్ ను 6 వేలు చేస్తామని ఇచ్చిన హామీ ఏడాద్కెనా అమలు చేయకపోవడం కాంగ్రెస్ పార్టీ దగాకోరు విధానాలకు నిదర్శనం. ఇచ్చే పింఛన్లలో కూడా రెండు నెలలు ఎగ్గొట్టి నిరుపేదల నోటికాడి బుక్కను లాగేసుకున్న కాంగ్రెస్ సర్కారుకు వారి పాపం తగలక మానదు. హైడ్రా పేరిట హంగామా సృష్టించి నిరుపేదలకు నిలువ లేకుండా చేసిన పాపం మీ కాంగ్రెస్ పార్టీని ఎప్పటికీ వెంటాడుతూనే ఉంటుంది. మూసీ బ్యూటిఫికేషన్ పేరిట మీ లక్షన్నర కోట్ల లూటిఫికేషన్ ప్లాన్ కూడా బట్టబయల్కెంది. బీఆర్ఎస్ హయాంలోనే ఎస్టీపీల నిర్మాణం పూర్తయినా కూడా, ఈ ప్రాజెక్టుకు లక్షన్నర కోట్లు టార్గెట్ పెట్టడం మూసీలో మీ మూటల వేటకేనని తెలంగాణలో ఎవరిని అడిగినా చెబుతారు. కనికరం లేని ముఖ్యమంత్రి ఆదేశాలతో.. కాంగ్రెస్ సర్కారు కూల్చివేతలకు కేరాఫ్‌గా మారితే.. ఉద్యమానికి కేంద్రబిందువుగా ఉన్న తెలంగాణ భవన్.. జనతా గ్యారేజీగా మారింది. కాంగ్రెస్ నిరంకుశ పాలనలో ప్రజలకు ఏ కష్టం వచ్చినా.. కన్నీళ్లొచ్చినా బాధితులు తలుపుతట్టే ఏకైక గడపగా తెలంగాణ భవన్ నిలిచింది. కాంగ్రెస్ చేతిలో దగాపడ్డ ఆటో డ్రైవర్ల నుంచి మొదలుకుని హైడ్రా, మూసీ బాధితుల వరకూ అందరినీ కడుపులో పెట్టుకుని కాపాడే రక్షణ కవచం.. తెలంగాణ భవన్ అనే విషయాన్ని మీరు కూడా గుర్తుపెట్టుకుంటే మంచిదని అన్నారు.



# అబద్దాలకు కేరాఫ్ అడ్రస్ అల వేంకటేశ్వర్ రెడ్డి

## మార్కెట్ కమిటీ చైర్మన్ పల్లేపాగు ప్రశాంత్

కొత్తకోట, డిసెంబర్ 11(ప్రభాత ఉదయం) నీ అవాకులు, చెవాకులు దేవరకద్ర నియోజక వర్గంలో పేలవని మదనాపురం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పల్లె పాగు ప్రశాంత్ అన్నారు. బుధవారం కొత్తకోట కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ...పేదల గుండె చప్పుడు కాంగ్రెస్ పార్టీ అని, పేదలను అన్ని విధాలుగా ఆదుకునే పార్టీ కాంగ్రెస్ పార్టీమేనన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలో తెలంగాణ రాష్ట్ర ప్రజలకు అనేక సంక్షేమ పథకాలను రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తుందని అన్నారు, దేశంలోనే ఏ రాష్ట్రంలో లేని విధంగా తెలంగాణ రాష్ట్రంలో రైతులందరికీ 2 లక్షల రూపాయల రుణమాఫీ చేసిన ఏకైక పార్టీ కాంగ్రెస్ పార్టీయన్నారు. మహిళలకు ఉచిత బస్సు, 200 యూనిట్లకు ఉచిత కరెంటు, గ్యాస్ సబ్సిడీ, క్వింటాల్ సన్న ధాన్యానికి 500 రూపాయల బోనస్ ఇలా అనేక పథకాలు ప్రజలకు అందజేస్తుందని తెలిపారు.దేవరకద్ర నియోజకవర్గ ప్రజల అండదండలతో ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే నెంబర్ వన్ నియోజవర్గంగా తీర్చిదిద్దుతున్నారు జిఎంఆర్ న్యాయవాద వృత్తిన్ని వదిలేసి ప్రజలకు సేవ చేస్తున్నాడన్నారు.నిన్న అబ్బద్దాల కూతల ఆల వెంకటేశ్వర్ రెడ్డి దేవరకద్ర అభివృద్ధిని చూసి ఓర్వలేక మతిస్థిమితం కోల్పోయి మాట్లాడుతున్నాడు, నువ్వు ఎన్ని అవాకులు, చెవాకులు పేల్చిన దేవరకద్ర ప్రజలు మిమ్మల్ని నమ్మే స్థితిలో లేరని అన్నారు. పది సంవత్సరాలు అధికారంలో ఉండి కొత్తకోట ఒక్క రూపాయి కూడా మీరు తెచ్చినా పాపాన పోలేదన్నారు. బడిపిల్లలు చెట్ల క్రింద చదువుకుంటుంటే ఎమ్మెల్యే జియంఆర్ చలించిపోయి వెంటనే భవనాలు నిర్మించాలని ప్రత్యేక చొరవతో శాంక్షన్ చేయించినా చరిత్ర మా జీఎమ్మార్ ది.. కొత్తకోట పట్టణం లో నెలకు యాభై వేల రూపాయల ఆదాయం వచ్చే ప్రభుత్వ భవాన్ని మీరు ఎందుకు ఆకస్మికంగా ఖాళీ చేసి కూల్చి వేశారో సమాధానం చెప్పాలి, ఆ భవనం వల్ల ప్రభుత్వానికి ప్రతి నెల లక్ష రూపాయలు లాసే కదా అని అన్నారు. మీ బిఆర్ ఎస్ పార్టీ వాళ్లు బోనస్ రాదు అన్నోల్లే రైతులకు పడుతున్నా బోనస్ ను చూసి, నిన్న నీ అనుచరుడు మాజీ సర్పంచ్ ఎద్దుల నాగేష్ కాంగ్రెస్ పార్టీ ఇచ్చే బోనస్ కోసం ఆశపడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుండి తక్కువ ధరకు రైతుల వద్ద వడ్లను కొనుగోలు చేసి, ఇక్కడ అమ్మడానికి వచ్చి దొరికిపోయిన దొంగలు మీరు, మీరా మా ప్రభుత్వం గురించి, మా ఎమ్మెల్యే గారు గురించి మాట్లాడేది అనీ ఫైరయ్యారు.. ప్రజలకు ముఖ్యంగా రైతులకు ఇచ్చినా హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేరుస్తుంటే జీర్ణించుకోలేని మీరు, పని గట్టుకొని పనికి రాని అంశాలను లేవనెత్తుతూ నానాయాగి చేస్తుంటే చూస్తూ ఊరుకోలేం, తగిన మూల్యాన్ని చెల్లించాల్సిందేనని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు నగరపు బీచ్ పల్లి, టౌన్ అధ్యక్షులు పోతులపల్లి శ్రీనివాస్, కిసాన్ సెల్ వేముల శ్రీనివాస్ రెడ్డి,మాజీ సర్పంచ్ చర్లపల్లి శేఖర్ రెడ్డి, మాజీ ఉపసర్పంచ్ ఎంజె,బోయేజ్, ప్రధాన కార్యదర్శి ఎల్లంపల్లి నరేందర్ రెడ్డి, డైరెక్టర్ బాదం వెంకటేష్, కో ఆప్షన్ సభ్యులు జే ఏం మిషేఖ్,డీలర్ శ్రీనివాసన్ రెడ్డి, ముజీబ్, గుంత రమణ,రైతు అధ్యక్ష్యులు సంధ్యపాగా వెంకటేష్, లక్ష్మమ్మయ్య, యూత్ కాంగ్రెస్ అజీజ్ అలీ,దిలీప్ రెడ్డి,బాలరాజు,నవీన్, అంజి యాదవ్,వలుగుమాన్ శ్యామ్ పాల్గొన్నారు.

## విమానాశ్రయాల అభివృద్ధికి మోదీ ప్రభుత్వం కృషి

మొదటి పేజీ తరువాయి...

సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా కొండా సురేఖ మాట్లాడుతూ.. భక్తుల మనోభావాలను దృష్టిలో ఉంచుకుని అమ్మవారి ఆలయాన్ని ప్రభుత్వ ఖర్చుతో నిర్మించడంతో పాటు.. పంచలోక విగ్రహాన్ని ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. అమ్మవారి విగ్రహ ప్రతిష్ట చేయడం చాలా ఆనందంగా ఉందన్నారు. కొంతమంది రాజకీయ లబ్ధికోసం మత విద్వేషాలను రెచ్చగొట్టడం మానుకోవాలని హెచ్చరించారు. శ్రీ ముత్యాలమ్మ తల్లిని బీజేపీ ఎంపీ ఈటెల దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హిందూ ధర్మానికి వ్యతిరేకంగా ఆలయంపై దాడి చేసిన వారిని ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు.



# కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో విగ్రహాలను తీయడం తప్పితే ప్రజలకు చేసింది ఏమీ లేదు

## ఫతేనగర్ ఫ్లైఓవర్ వద్ద తెలంగాణ తల్లికి పాలాభిషేకం నిర్వహించిన కార్పొరేటర్ పండాల సతీష్ గౌడ్

కూకట్‌పల్లి, డిసెంబర్ 11 (ప్రభాత ఉదయం) తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలను పట్టించుకోకుండా విగ్రహాలను తీయడమే పనిగా పెట్టుకున్నారని ఫతేనగర్ డివిజన్ కార్పొరేటర్ పండాల సతీష్ గౌడ్ అన్నారు. బుధవారం బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపుమేరకు కూకట్ పల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఆదేశాల మేరకు ఫతేనగర్ డివిజన్ పరిధిలోని ఫతేనగర్ ఫ్లైఓవర్ వద్ద ఉన్న తెలంగాణ తల్లి విగ్రహానికి, హెచ్పి రోడ్ లో ఉన్న తెలంగాణ తల్లి విగ్రహానికి పాలాభిషేకం చేసి పూలమాలలు వేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ సతీష్ గౌడ్ మాట్లాడుతూ రేవంత్ రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక సిఎం రేవంత్ రెడ్డి పేర్లను మార్చడం, విగ్రహాలు మార్చడం తప్పితే పేద ప్రజలకు ఇచ్చిన 6 గ్యారంటీలను గాలికి వదిలి రోజుకు ఏదో ఒక డైవర్షన్ పాలిటిక్స్ చేస్తూ ప్రజలను మభ్యపెడుతూ పబ్బం గడుపుతున్నాడని అన్నారు. రానున్న రోజుల్లో కాంగ్రెస్ ప్రభుత్వానికి రేవంత్ రెడ్డికి ప్రజలు తగ్గిన బుద్ధి చెబుతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో డివిజన్ పార్టీ అధ్యక్షులు కంచిపక్షపతి, రాష్ట్ర నాయకులు కుతాడి రాములు, ప్రధాన కార్యదర్శి సుదర్శన్ రెడ్డి, గౌస్, తూము జగదీష్, నగేష్, అఫ్జల్, కన్నయ్య పాల్గొన్నారు.

# గ్రూప్-2 పరీక్షలు యథాతథం

మొదటి పేజీ తరువాయి...

డిసెంబర్ 16న గ్రూప్ 2 కి సంబంధించి పేపర్ 3, 4 పరీక్షలు ఉన్నాయని, అదేరోజు ఆర్ఆర్‌బీ పరీక్ష కూడా ఉందని అన్నారు. రెండింటికి దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు ఒక పరీక్ష రాస్తే మరో పరీక్షను కోల్పోవల్సి వస్తుందని, అందువల్ల గ్రూప్ 2 పరీక్షలను రీషెడ్యూల్ చేయమని కోరుతూ టీజీపీఎస్సీకి నవంబరు 25న వినతిపత్రం ఇచ్చినా పట్టించుకోలేదన్నారు.ఇక మరోవైపు టీజీపీఎస్సీ తరపు న్యాయవాది రాజశేఖర్ వాదనలు వినిపిస్తూ.. 783 పోస్టులకు 5.51 లక్షల మంది అభ్యర్థులు దరఖాస్తు చేశారని, ఇప్పటికే హాల్‌టికెట్లు కూడా డౌన్‌లోడ్ చేసుకున్నారని తెలిపారు. పరీక్ష నిర్వహణకు ఏర్పాట్లన్నీ పూర్తయ్యాయన్నారు. కేవలం 22 మంది కోసం పరీక్ష వాయిదా వేస్తే కొందరికే ప్రయోజనం ఉంటుందని, మిగతా లక్షల మంది అభ్యర్థులు నష్టపోయే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయమూర్తి పరీక్ష ఏర్పాట్లన్నీ పూర్తయినందున.. ఈ స్థాయిలో పరీక్షలు వాయిదా వేస్తూ మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వలేమని స్పష్టం చేసింది. ఈ పిటిషన్‌పై వివరణ ఇవ్వాలంటూ టీజీపీఎస్సీకి నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణను ఫిబ్రవరి 6కు వాయిదా వేసింది.కాగా తెలంగాణలో గ్రూప్ 2 పరీక్షల హాల్ టికెట్లు తాజాగా విడుదలయ్యాయి. డిసెంబర్ 15, 16 తేదీల్లో జరగనున్న ఈ పరీక్షల హాల్‌టికెట్లను టీజీపీఎస్సీ తన అధికారిక వెబ్‌సైట్‌లో డౌన్‌లోడ్ చేసుకునేందుకు అందుబాటులోకి లింక్ తీసుకు వచ్చింది. మొత్తం 4 పేపర్లకు ఈ పరీక్షలు ఉంటాయి. ఉదయం, మధ్యాహ్నం రెండు సెషన్లలో ఈ పరీక్షలు జరగనున్నాయి. ఈ పోస్టుల కోసం రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 5.51లక్షల మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. వీరంతా పరీక్షకు హాజరుకానున్నారు. ఇతర సమాచారం కోసం టీజీపీఎస్సీ హెల్ప్‌లైన్ నంబర్లు 040-22445566/ 23542185/23542187ను సంప్రదించవచ్చు.

# రాజీవ్ సివిల్స్ అభయ హస్తం సాయం

మొదటి పేజీ తరువాయి...

కదారి శ్రీవాణి, గాదె శ్వేత, రాపర్తి ప్రీతి, మెదక్ జిల్లాకు చెందిన కుమ్మరి శ్రవణ్ కుమార్, రంగారెడ్డి జిల్లాకు చెందిన మొహమ్మద్ అశ్ఫాక్, తొగరు సూర్యతేజ, మహబూబాబాద్ జిల్లాకు చెందిన బెస్త ప్రియాంజలి, సిద్ధిపేటకు చెందిన నరిగె స్వామి, నాగర్‌కర్నూలుకు చెందిన గోకమల్ల ఆంజనేయులు, ఆదిలాబాద్‌కు చెందిన ఆర్. ప్రమోద్ కుమార్, వికారాబాద్‌కు చెందిన బి. ప్రహ్లాద్, జగిత్యాలకు చెందిన బురుగుపెల్లి నీరజ్ కుమార్, భద్రాద్రి కొత్తగూడెంకు చెందిన జస్వంత్ కుమార్, అసిఫాబాద్-కుమ్రంభీం జిల్లాకు చెందిన రామ్టెంకి సుధాకర్ సివిల్స్ మెయిన్స్? క్వాలిఫై అయిన జాబితాలో ఉన్నారు. తెలంగాణ నుంచి మెయిన్స్ ఫలితాల్లో విజయం సాధించి ఇంటర్వ్యూకు ఎంపికైన అభ్యర్థులందరికీ సీఎం రేవంత్ రెడ్డి అభినందనలు తెలిపారు. రాజీవ్ గాంధీ సివిల్స్ అభయ హస్తం కింద ప్రభుత్వం లక్ష రూపాయలు ఆర్థిక సహాయం అందజేసిన వారిలో 20 మంది అభ్యర్థులు ఇంటర్వ్యూకు ఎంపిక కావడం పట్ల సీఎం అభినందనలు తెలిపారు. తెలంగాణ నుంచి ఎక్కువ మంది సివిల్స్ సాధించేలా తదుపరి దశల్లోనూ అభ్యర్థులు రాణించాలని సీఎం ఆకాంక్షించారు. మెయిన్స్‌లో ఉత్తీర్ణులై ఇంటర్వ్యూకు అర్హత సాధించిన వారికి మరో రూ.లక్ష అందిస్తామని సీఎం గతంలో హామీ ఇచ్చారు. యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్(యూపీఎస్సీ) సివిల్ సర్వీసెస్ మెయిన్స్ ఎగ్జామ్ 2024 ఫలితాలను మంగళవారం విడుదల చేసింది. అభ్యర్థులు తమ ఫలితాలను అధికారిక వెబ్‌సైట్ లో చూసుకోవచ్చు. మెయిన్ సివిల్ సర్వీసెస్ పరీక్షలో ఉత్తీర్ణులైన అభ్యర్థులు ఇప్పుడు ఇంటర్వ్యూ రౌండ్ కు హాజరు కావాల్సి ఉంటుంది. ఇంటర్వ్యూ షెడ్యూల్ ను త్వరలోనే వెబ్‌సైట్‌లో విడుదల చేయనున్నారు. అభ్యర్థులు యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ప్రధాన కార్యాలయం, ధోల్పూర్ హౌస్, షాజహాన్ రోడ్, న్యూఢిల్లీ-110069లో ఇంటర్వ్యూకు హాజరు కావాల్సి ఉంటుంది.

# అమెరికాతో అదానీ పోర్ట్స్ రుణ ఒప్పందం ఉపసంహరణ

మొదటి పేజీ తరువాయి...

ఫైలింగ్‌ను బట్టి తెలిసింది. రుణ ఒప్పందం నుంచి వెనక్కి తగ్గిన నేపథ్యంలో కంపెనీ తన ఆదాయం, ఇతర మూలాల నుంచి వచ్చిన డబ్బు, మూలధనం నుంచి ఖర్చు చేయాలని నిర్ణయించినట్టు తెలిసింది. కాగా, అదానీపై ఇటీవల అమెరికాలో తీవ్ర అభియోగాలు నమోదయ్యాయి. సోలార్ ప్రాజెక్టుల కోసం భారత్‌లో ప్రభుత్వ అధికారులకు ముడుపులు ఇచ్చేందుకు అమెరికాలోని పెట్టుబడిదారుల నుంచి 265 మిలియన్ డాలర్లు సేకరించినట్టు కేసు నమోదైంది. అయితే, అమెరికా ఆరోపణలను అదానీ గ్రూప్ కొట్టిపడేసింది. అదానీ ప్రస్తుతం ఆసియా కుబేరుల్లో రెండోస్థానంలో ఉన్నారు. రిలయన్స్ ఇండస్ట్రీస్ అధినేత ముకేశ్ అంబానీ తొలి స్థానంలో కొనసాగుతున్నారు.

# 2026 జూన్ నాటికి భోగాపురం విమానాశ్రయం పూర్తి

హైదరాబాద్, డిసెంబర్ 11 (ప్రభాత ఉదయం): కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం విమానాశ్రయాల అభివృద్ధికి కృషి చేస్తుందని, మరో పదేళ్లలో దేశంలో 50 ఎయిర్ పోర్టులు పెంచడమే లక్ష్యంగా పెట్టుకున్నట్లు కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు తెలిపారు. 2026 జూన్ నాటిక భోగాపురం విమానాశ్రయం పూర్తవుతుందని పేర్కొన్నారు. శంషాబాద్‌లోని నోవాటెల్‌లో బుధవారం జరిగిన ఎయిర్‌పోర్ట్ ప్రిడిక్టివ్ ఆపరేషన్ సెంటర్ ప్రారంభోత్సవంలో రామ్మోహన్ నాయుడు పాల్గొని ప్రసంగించారు. తెలంగాణలోని శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం అభివృద్ధి వెనుక ఏపీ ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు కృషి ఉందన్నారు రామ్మోహన్ నాయుడు. దాదాపు రెండు దశాబ్దాల కిందట 5 వేల ఎకరాల భూసేకరణ అంటే మామూలు విషయం కాదన్నారు. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్టులపై ఫోకస్ చేస్తోందన్నారు. అయితే ఇందుకు చంద్రబాబు ప్లానింగే కారణం అన్నారు. ఇంకా చెప్పాలంటే దేశంలోని ఐటీ విప్లవం వెనక టీడీపీ అధినేత చంద్రబాబు కృషి ఉందన్నారు. ఐటీ ద్వారా దేశం వేగంగా అభివృద్ధి చెందుతుందని చంద్రబాబు నమ్ముతారని ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. రామ్మోహన్ నాయుడు మాట్లాడుతూ.. 'దేశంలో విమానాశ్రయాల నిర్వహణలో బెస్ట్ టెక్నాలజీ వాడుతున్నాం. తాజాగా ఏఐ డిజిటల్ ప్లాట్‌ఫామ్ ప్రారంభించాను. దేశ వ్యాప్తంగా 24 విమానాశ్రయాల్లో డిజియాత్ర టెక్నాలజీ వినియోగిస్తున్నాం. ఎయిర్‌పోర్టులు అంటే కేవలం రవాణా సౌకర్యం కాదు. అది ఎందరికో ఉపాధి సైతం కల్పిస్తున్నాయి. ఎయిర్‌పోర్టులో డేటా అనలటిక్స్ వినియోగించి మరింత మెరుగ్గా సేవలు అందిస్తాం. ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలో విమానయాన మంత్రిత్వ శాఖ వేగంగా అభివృద్ధి చెందుతోంది. మన అభివృద్ధి, ఆర్థిక వ్యవస్థలో మార్పులు, టెక్నాలజీ వినియోగం కారణంగా ప్రపంచ దేశాలు భారత్ వెట్కపు చూస్తున్నాయి. తెలంగాణలో వరంగల్ విమానాశ్రయంతో పాటు, ఏపీలోని భోగాపురం ఎయిర్‌పోర్టులను త్వరగా పూర్తి చేయాలని భావిస్తున్నాం. 2026 జూన్ కల్లా భోగాపురం విమానాశ్రయం పూర్తి చేస్తాం. విమానాశ్రయంలో ప్రిడిక్టివ్ ఆపరేషన్ సెంటర్ ప్రారంభించడం ఒక మైలు రాయి' అని అన్నారు. విమానాశ్రయాల సౌత్ అండ్ చీఫ్ ఇన్నోవేషన్ ఆఫీసర్ ఎస్‌జీకే కిషోర్ ఈ ఫీచర్ గురించి మాట్లాడుతూ.. మా కొత్త AI-ఎనేబుల్డ్ డిజిటల్ ప్లాట్‌ఫారమ్, ఎయిర్‌పోర్ట్ ప్రిడిక్టివ్ ఆపరేషన్ సెంటర్ పనులను ఆధునీకరించడంలో, ప్రయాణీకులకు మెరుగైన సేవల్ని అందిస్తుంది. రియల్ టైమ్ డేటా విశ్లేషణ, ప్యాసింజర్స్ వెయిటింగ్ టైమ్ తగ్గించనున్నాం. మెరుగైన భద్రతా సేవలు లభిస్తాయి. భారత్‌లో 73 శాతం ఈ-కామర్స్, టెక్ స్టార్టప్‌లు AI, వెబ్ 3.0 అప్లికేషన్‌ల ఉద్యోగాల వైపు మొగ్గుచూపుతున్నారని నివేదిక వచ్చిందని తెలిపారు.

# యూపీఎస్సీ సివిల్స్ ఇంటర్వ్యూకి 90 మందికి పైగా అర్హత!

## సత్తా చాటిన తెలుగు రాష్ట్రాల అభ్యర్థులు

న్యూఢిల్లీ, డిసెంబర్ 11 (ప్రభాత ఉదయం): యూపీఎస్సీ నిర్వహించిన సివిల్ సర్వీసెస్ మెయిన్ పరీక్షల ఫలితాలు విడుదలైన సంగతి తెలిసిందే. ప్రిలిమ్స్‌లో అర్హత సాధించిన వారికి సెప్టెంబర్ 20, 21, 22, 28, 29 తేదీల్లో మెయిన్ పరీక్షలు జరిగాయి. ఈ ఫలితాలను డిసెంబర్ 9న సాయంత్రం యూపీఎస్సీ విడుదల చేసింది. పర్సనాలిటీ టెస్ట్ (ఇంటర్వ్యూ)కు అర్హత సాధించిన అభ్యర్థుల హాల్‌టికెట్ నంబర్లతో కూడిన జాబితాను విడుదల చేసింది. ఈ ఏడాదికి మొత్తం 1056 ఉద్యోగాలను భర్తీ చేసేందుకు యూపీఎస్సీ నోటిఫికేషన్ ఇచ్చింది. జూన్ 16న ప్రిలిమ్స్ పరీక్ష నిర్వహించి జులై 1న ఫలితాలు వెల్లడించారు. ఆ తర్వాత సెప్టెంబర్‌లో మెయిన్స్ నిర్వహించగా తాజాగా ఫలితాలు వెల్లడించారు. యూపీఎస్సీ పరీక్షలు మొత్తం మూడు దశల్లో జరుగుతాయి. ప్రిలిమ్స్, మెయిన్స్ పరీక్షలు పూర్తవగా త్వరలోనే ఇంటర్వ్యూ నిర్వహించనున్నారు. ఇంటర్వ్యూలో సత్తా చాటిన అభ్యర్థులను ఐఏఎస్, ఐఎఫ్ఎస్, ఐపీఎస్, ఇతర కేంద్ర (గ్రూప్ ఏ, గ్రూప్ బి) సర్వీసులకు ఎంపిక చేస్తారు. అయితే మెయిన్స్‌లో క్వాలిఫై అయిన వారిని మాత్రమే ఇంటర్వ్యూకి అనుమతిస్తారు.

# ప్రేమావతిపేట్ నుంచి వ్యవసాయ విశ్వవిద్యాలయంలోకి వెళ్లడానికి ఉన్న దారి మూసివేతను అడ్డుకున్న స్థానికులు



ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య తో మాట్లాడుతున్న కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి, బీఆర్ఎస్ రాజేంద్రనగర్ నియోజకవర్గం ఇంచార్జి పి. కార్తీక్ రెడ్డి




పోలీసు స్టేషన్‌లో ఉన్న ప్రేమావతి పేట్ యువకులతో మాట్లాడుతున్న పి. కార్తీక్ రెడ్డి

## అరెస్ట్ చేసిన పోలీసులు



వ్యవసాయ విశ్వవద్యాలయం వద్ద పి కార్తీక్ రెడ్డి, తోకల శ్రీనివాస్ రెడ్డి, కొలన్ సుభాష్ రెడ్డి , ధర్మా రెడ్డి, పి. మల్లేష్ యాదవ్ తదితరులు

బుద్వేల్, డిసెంబరు11(ప్రభాత ఉదయం): ప్రేమావతిపేట్ నుంచి వ్యవసాయ విశ్వవిద్యాలయం లోకి వెళ్లే రహదారిని వ్యవసాయ వర్సిటీ అధికారులు బుదవారం మూసివేస్తుండగా స్థానికులు అడ్డుకున్నారు. ప్రహరీగోడ నిర్మాణ పనులను అడ్డుకున్న యువకులపై వ్యవసాయ విశ్వవిద్యాలయం అధికారులు రాజేంద్రనగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు గోల్కొండ రాజ్ కుమార్, ఎల్లకాడి సూర్యం, ఉపేందర్ ను అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్ కు తరలించారు. ఈ విషయాన్ని స్థానికుల ద్వారా తెలుసుకున్న బీఆర్ఎస్ రాజేంద్రనగర్ నియోజకవర్గం ఇంచార్జ్ పట్లోళ్ల కార్తీకరెడ్డి, ఆ పార్టీ నాయకులు కొలన్ సుబాష్ రెడ్డి , పోరెడ్డి ధర్మారెడ్డి, నోముల తాము యాదవ్. అక్కెం రాఘవేందర్ యాదవ్, రావుల జంగయ్యలు రాజేంద్రనగర్ ఇన్స్ పెక్టర్ క్యాస్ట్రో తో మాట్లాడి పోలీస్ స్టేషన్ మంచి విడిపించారు.

**వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ అలాస్ జానయ్య తో చర్చలు :**
ప్రేమావతిపేట్ నుంచి వ్యవసాయ విశ్వవిద్యాలయంలోకి వచ్చే దారిని మూసీ వేస్తు స్తు గోడకడుతున్న విషయంపై మైలార్ దేవుపల్లి డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి, బీజేపీ రాజేంద్రనగర్ నియోజకవర్గం కన్వీనర్ పి.మలేశ్ యాదవ్ , బీఆర్ఎస్ నాయకులు పట్లోళ్ల కార్తీక్డి, కొలన్ సుబాష్ రెడ్డి లు వ్యవసాయ విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ అల్దాస్ జానయ్యతో చర్చించారు. 50 సంవత్సరాలుగా ఉన్న దారిని మూసీ వేస్తే ఎలా అని ప్రశ్నించారు. దానికి వైస్ చాన్సలర్ మనుషులు వెళ్లడానికి రౌండ్ గేటు పెడతామని చెప్పగా స్థానికులు దానికి ఒప్పుకోలేదు. ద్విచక్ర వాహనాలు వెళ్లేలా దారిని వదలాలని పట్టుబట్టారు. పట్లోళ్ల కార్తీక్ రెడ్డి, తోకల శ్రీనివాస్ రెడ్డిలు వైస్ చాన్సలర్ తో మాట్లాడి ద్విచక్ర వాహనాలు వెళ్లడానికి దారిని వదిలేలా చూసారు.


**గోడ స్థానంలో గేటు పెట్టి బోనాల సమయంలో దారి వదలాలి : స్థానికులు**
ప్రేమావతిపేట్ నుంచి వ్యవసాయ విశ్వద్యాయలంలోకి వెళ్లకుండ గేటు ఏర్పాటు చేయడం వల్ల వ్యవసాయ విశ్వవిద్యాయలం అవరణలో ఉన్న అమ్మవారి దేవాలయాలకు బోనాలు సమర్పించడానికి ఇబ్బంది కలుగుతుందని స్థానికులు వాపోయారు. గోడకు బదులు గేటు ను ఏర్పాటు చేసి పండుగల సమయంలో గేటు తెరిచే విదంగా చూడాలన్నారు. దానికి వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ అల్దాస్ జావయ్య ఒప్పకోవడంతో వివాదం సద్దుమణిగింది. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు టి.సురేశ్, ఎన్.జగన్ తదితరులు పాల్గొన్నారు.



## గద్వాలను పారిశ్రామిక కేంద్రంగా అభివృద్ధి చేయాలి

### ఎమ్మెల్యే కృష్ణమోహన్ రెడ్డి

గద్వాల జిల్లా ప్రతినిధి, డిసెంబర్ 11(ప్రభాత ఉదయం)గద్వాల నియోజక వర్గంలో పరిశ్రమల ఏర్పాటుకు అపారమైన అవకాశాలున్నాయని, నియోజకవర్గాన్ని పారిశ్రామిక కేంద్రంగా అభివృద్ధి చేయాలని గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి అన్నారు. బుధవారం హైదరాబాద్ లో రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబును గద్వాల ఎమ్మెల్యే మర్యాద పూర్వకంగా కలిశారు. కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల సరిహద్దులో ఉన్న గద్వాల నియోజకవర్గంలో రోడ్డు, రైల్వే రవాణ వ్యవస్థంగా పటిష్టంగా ఉందని అన్నారు. గద్వాల నియోజకవర్గంలో సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల ఏర్పాటుకు అన్ని వనరులు సమృద్ధిగా ఉన్నాయని తెలిపారు. పరిశ్రమలకు అవసరమైన భూమి, నీటి లభ్యత అందుబాబులో ఉన్నాయని ఎమ్మెల్యే వెల్లడించారు. గద్వాలలో పరిశ్రమలు నెలకొల్పి ఉపాధి అవకాశాలు కల్పించేలా చర్యలు తీసుకోవాలని మంత్రిని ఈ సందర్బంగా గద్వాల ఎమ్మెల్యే కోరారు.



వధూ వరులను ఆశీర్వదిస్తున్న మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పి. సబితా ఇంద్రారెడ్డి, బీఆర్ఎస్ రాజేంద్రనగర్ ఇంచార్జీ పి. కార్తీక్ రెడ్డి

## ఘనంగా డాక్టర్ రాహుల్ - డాక్టర్ గీతిక ప్రతిమల వివాహం

బుద్వేల్,డిసెంబరు11(ప్రభాత ఉదయం): రాజేంద్రనగర్ సర్కిల్ హైదర్ గూడ వాస్తవ్యులు, టీ టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి మ్యాడం రామేశ్వర్ రావు - కళాశ్రీ (రమ) కుమారుడు డాక్టర్ రాహుల్ వివాహము తోట ప్రసాద్ంపద్మజా రాణి ల కుమార్తె డాక్టర్ గీతిక ప్రతిమ ల వివాహం బుదవారం రాత్రి శంషాబాద్ మల్లిక కన్వెన్షన్ సెంటర్ లో ఘనంగా జరిగింది. ఈ వేడుకల్లో మాజీ మంత్రి పి సబితా ఇంద్రారెడ్డి తో పాటు ఆమే తనయుడు భీఆర్ఎస్ రాజేంద్రనగర్ నియోజకవర్గ ఇంచార్జి పి కార్తీక్ రెడ్డి హాజరై వధూ వరుల ను ఆశీర్వదించారు. వారితో పాటు మంత్రి జూపల్లి కృష్ణారావు, , రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి ప్రకాష్ గౌడ్, కార్పొరేటర్ పి అర్చన జయప్రకాష్, వివిధ పార్టీల నాయకులు, జర్నలిస్టులు పాల్గొన్నారు.





రెవరెండ్ కె సుందర్ పాల్

## పాస్టర్స్ ఫ్యామిలీస్ క్రిస్మస్ వేడుకలను విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు


బుద్వేల్, డిసెంబరు11(ప్రభాత ఉదయం): రాజేంద్రనగర్ పాస్టర్స్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో మంగళవారం కిస్మత్పూర్ రాక్ చర్చ్ లో నిర్వహించిన పాస్టర్స్ ఫ్యామిలీస్ క్రిస్మస్ సెలబ్రేషన్స్ ను విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలుపుతున్నట్లు ఫెలోషిప్ అధ్యక్షుడు రెవరెండ్ కె సుందర్ పాల్ తెలిపారు. క్రిస్మస్ దినాలలో యేసయ్య ఆశీర్వాదాలు ప్రతి ఒక్కరి పైకి రావాలని ప్రార్థించారు. సహకరించిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలియజేశారు.



బిషప్ రేచల్ జ్యోతి కొమానపల్లి

## ఈ నెల 14న కిస్మత్పూర్ రాక్ చర్చిలో సెమీ క్రిస్మస్ వేడుకలు

బుద్వేల్, డిసెంబరు11(ప్రభాత ఉదయం): ఈనెల 14న సాయంత్రం 6 గంటలకు కిస్మత్ పూర్ రాక్ చర్చి లో సెమీ క్రిస్మస్ వేడుకలను నిర్వహించనున్నట్లు మన్నా మినిస్ట్రీస్ కో ఫౌండర్ బిషప్ రేచల్ జ్యోతి కొమానపల్లి తెలిపారు. చుట్టుపక్కల చర్చీల సభ్యులు పాల్గొని దేవుని ఆశీర్వాదాలు పొందుకోవాలన్నారు. సెమీ క్రిస్టమస్ ప్రత్యేక ఆరాధనలలో ఏలూరుకు చెందిన రెవరెండ్ జ్యోతి బాబు బైబిల్ సందేశాలను వివరిస్తారన్నారు.



## ఘనంగా శ్రీ చౌడేశ్వరి మాత విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం

### పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించిన వడ్డేపల్లి రాజేశ్వరరావు

కూకట్‌పల్లి, డిసెంబర్ 11 (ప్రభాత ఉదయం) కూకట్ పల్లి అంకుర హాస్పిటల్ వెనుక నూతనంగా నిర్వహించిన శ్రీ చౌడేశ్వరి మాత ఆలయంలో ఆలయ కమిటీ ఆహ్వానం మేరకు బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు శ్రీ చౌడేశ్వరి మాత విగ్రహ ప్రతిష్ట మహోత్సవంలో పాల్గొని, అమ్మవారి దివ్యదర్శనమును గావించి అమ్మవారి కృపాకటాక్షాలకు పాత్రులయ్యారు. అనంతరం ఆలయ అర్చకులు వడ్డేపల్లి రాజేశ్వరరావు ని వేదమంత్రోచ్ఛారణతో ఆశీర్వదించగ, కూకట్ పల్లీ యాదవ సంఘం అధ్యక్షులు భత్తుల మల్లేష్ యాదవ్ కమిటీ సభ్యులతో కలిసి రాజేశ్వరరావు ని ఘనంగా సన్మానించారు.

## మహిళల ఆర్థికాభివృద్ధికి కృషి



మైలార్‌దేవ్‌పల్లిలో మహిళల కుట్టు శిక్షణ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి ప్రకాష్ గౌడ్



మహిళలు కుడుతున్న విధానాన్ని పరిశీలిస్తున్న రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి ప్రకాష్ గౌడ్

### ఎమ్మెల్యే టి.ప్రకాశ్ గౌడ్

బుద్వేల్, డిసెంబరు11 (ప్రభాత ఉదయం): మహిళల ఆర్థికాభివృద్ధికి ఇందిరా మహిళాశక్తి పథకం ఎంతో ఉపయోగపడుతుందని రాజేంద్రనగర్ నియోజకవర్గం ఎమ్మెల్యే టి. ప్రకాశ్ గౌడ్ అన్నారు. మైలార్దేవుపల్లి డివిజన్ పరిధిలో ఇందిరా మహిళా శక్తి కార్యక్రమంలో భాగంగా బుధవారం మహిళా సంఘాల సభ్యులకు రూ.8 లక్షలతో కొనుగోలు చేసిన 10 కుట్టు మిషన్లతో స్టిచ్చింగ్ సెంటర్ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే టి. ప్రకాశ్ గౌడ్ మాట్లాడుతూ, నైపుణ్యం ఉన్న ఆర్థిక పరిస్థితులు సహకరించక ఇంటికే పరిమితమైన మహిళలకు అవకాశాలు అందించి వారిని పారిశ్రామిక వేత్తలుగా ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. మహిళల స్వయం ఉపాధికి బాటలు వేయడంతో పాటు వారి ఆర్థికాభివృద్ధికి పక్కా ప్రణాళికలతో ముందుకు సాగుతున్నామన్నారు. మహిళలు వివిధ వ్యాపారాలు చేసుకునేందుకు వీలుగా యూనిట్లు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. ఈ సదావకశాన్ని మహిళలందరు ఉపయోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో రాజేంద్రనగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ కె. రవి కుమార్, మహిళా నాయకురాలు సునీతగౌడ్, సబితారెడ్డి, శరణమ్మ, పుష్ప, నిర్మల, గీత తదితరులు పాల్గొన్నారు.

# సమగ్ర శిక్ష ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలి



గద్వాల జిల్లా ప్రతినిధి, డిసెంబర్ 11(ప్రభాత ఉదయం)సమగ్ర శిక్ష ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని పీఆర్టీయు జిల్లా అధ్యక్షుడు తిమ్మారెడ్డి కోరారు. బుధవారం జిల్లా కేంద్రంలో విద్యాశాఖ సమగ్ర శిక్ష ఉద్యోగుల డిమాండ్ల సాధన కొరకు నిర్వహించిన శాంతియుత రిలే నిరసన దీక్ష 5వ రోజుకు చేరుకుంది. పీఆర్టీయు జిల్లా అధ్యక్షుడు తిమ్మారెడ్డి, సిఐటియు జిల్లా కార్యదర్శి వెంకటస్వామి మద్దతు పలికారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ప్రస్తుత ప్రభుత్వం విద్యా శాఖలో సమస్యలను పక్కనపెట్టి ఇంటిగ్రేటెడ్ స్కూలింగ్ సిస్టంను ప్రవేశపెడుతున్నారన్నారు. సీఎం రేవంత్ విద్యా శాఖను తన దగ్గరే పెట్టుకుని విద్యా శాఖలోని సమస్యలను పట్టించుకోవడం లేదని ప్రస్తుతం సీఎం ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఉద్యోగులకు ఇచ్చిన హామీని నిలబెట్టుకొవాలన్నారు. ఎడ్యుకేషనల్ ఇన్స్టిట్యూషన్స్ కరస్పాండెంట్ మరియు జేఎల్ అసోసియేషన్ డాక్టర్ మహేందర్ మాట్లాడుతూ ఉద్యమాలు ఒక పద్ధతి ప్రకారం చేయాలని, ఉద్యమాలు చేసేటప్పుడు కొంతమంది నిరుత్సాహపరిచిన వెనకడుగు వేయకుండా 100 రోజులు సమ్మె చేశామన్నారు. పాఠశాల విద్యాశాఖ, సమగ్ర శిక్ష ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని, వెంటనే పే స్కేల్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. రీ ఎంగేజ్ విధానం తొలగించి, ప్రభుత్వ నియామకాల్లో వెయిటేజ్ కల్పించాలన్నారు. పీటీఐలకు మిగతా ఎస్ఎస్ఏ ఉద్యోగుల వలే 12 నెలల వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. జీవిత బీమా, ఆరోగ్య బీమా రూ.10 లక్షలు, పదవీ విరమణ బెనిఫిట్స్ కింద మరో రూ.10 లక్షలు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఇటిక్యాల,మానవపాడు, గద్వాల, కేటిదొడ్డి, ధరూర్, కేజిబివిల స్పెషల్ ఆఫీసర్లు ఆసియా బేగం, స్పెషల్ ఆఫీసర్ అనురాధ, శ్రీదేవి. పద్మావతి, ఆఫీసర్ గోమతి మరియు అన్ని కేజీబీవీల నుండి సి .ఆర్. టి .లు . పీజీసీఆర్టీలు, నాన్ టీచింగ్ స్టాఫ్, జేఏసి జిల్లా అధ్యక్షుడు ఉషనప్ప, ప్రధాన కార్యదర్శి గోపాల్ , సమగ్ర శిక్ష లోని అన్ని విభాగాల అధ్యక్షులు పాల్గొన్నారు.




## టీఎస్ మెసా నూతన కార్యవర్గం ఎన్నిక

గద్వాల జిల్లా ప్రతినిధి, డిసెంబర్ 11(ప్రభాత ఉదయం) తెలంగాణ రాష్ట్ర మైనార్టీ ఎంప్లాయిస్ సర్వీస్ అసోసియేషన్ జిల్లా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. బుధవారం గద్వాల టిఎస్ మెస్సా జిల్లా సర్వసభ్య సమావేశం నిర్వహించారు. టిఎస్ మెస్సా జిల్లా అధ్యక్షులుగా పని చేసిన షేక్ బషీర్ అహ్మద్ ను స్టేట్ కౌన్సిల్ మెంబర్ గా ఎన్నుకున్న సందర్భంగా ఆయనను సన్మానించారు. అనంతరం జిల్లా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షులు గా మహమ్మద్ బషీర్ అహ్మద్, అసోసియేట్ ప్రెసిడెంట్ గా షేక్ నదీమ్, వైస్ ప్రెసిడెంట్ లుగా ఎస్ జహురుద్దీన్, మహమ్మద్ కాజా పాషా, జాయింట్ సెక్రటరీగా మహమ్మద్ రఫీ, మహమ్మద్ మస్తాన్ వలి , ఆర్గనైజింగ్ సెక్రటరీగా ఎండి షేక్షావలి, రిజ్వాన , స్పోర్ట్స్ అండ్ కల్చరల్ సెక్రటరీగా కపిల్ హైమద్ లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అసోసియేషన్ సభ్యులు మరియు టీఎన్జీవోస్ రాష్ట్ర కార్యదర్శి ఎన్.భీమన్న మరియు టీఎన్జీవోజిల్లా అధ్యక్షుడు నాగార్జున్ గౌడ్ , కోశాధికారి విష్ణు పాల్గొన్నారు.



## తెలంగాణ మ్యాథ్స్ ఫోరం ఆధ్వర్యంలో విద్యార్థులకు ప్రతిభాపాటవ పరీక్షలు

గద్వాల జిల్లా ప్రతినిధి, డిసెంబర్ 11(ప్రభాత ఉదయం)తెలంగాణ మాథ్స్ ఫోరం జిల్లా శాఖ ఆధ్వర్యంలో జిల్లాలోని అన్ని హైస్కూల్ లకు సంబంధించిన విద్యార్థులకు జిల్లా స్థాయి గణిత ప్రతిభాపాట పోటీల ను బుధవారం గద్వాలలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. ఇందులో ఇంగ్లీష్ మీడియం విభాగంలో ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల(గద్వాల) విద్యార్థి వినయ్ మొదటి బహుమతి, శువ సాయి రెండో బహుమతి, టి.హర్షిత మూడో బహుమతి సాధించారు. తెలుగు మీడియం విభాగంలో జిల్లా మొదటి బహుమతి జెడ్పిహెచ్ఎస్( తనగల) విద్యార్థి సుమాంజలి మొదటి బహుమతి, జడ్.పి.హెచ్.ఎస్ (పులికల్) విద్యార్థి కే. అనూష రెండో బహుమతి, జడ్పీహెచ్ఎస్ (తనగల)విద్యార్థి వై.హరిత మూడో బహుమతి సాధించారు. విజేతలకు జిల్లా విద్యాశాఖ అధికారి అబ్దుల్ ఘని అందజేశారు. ఈ కార్యక్రమంలో టిఎంఎఫ్ రాష్ట్ర పరిశీలకురాలు శోభారాణి, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జహురుద్దీన్, విష్ణు మరియు సభ్యులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమం అనంతరం టిఎంఎఫ్ జిల్లా నూతన కార్యవర్గం గణిత ఉపాధ్యాయులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా వరద సుందర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా కే. అనిత, వైస్ ప్రెసిడెంట్ గా బసవరాజు,జాయింట్ సెక్రటరీ గా అగస్టిన్, ట్రెజరర్ గా బి. సమరసింహారెడ్డి, గౌరవ అధ్యక్షులుగా బి విష్ణు, అడ్వైజర్ గా జహురద్దీన్ లను ఎన్నుకోవడం జరిగింది ఎన్నిక కావడం జరిగింది



రావుల సురేందర్ రెడ్డిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే జిఎంఆర్

## కొత్తకోట మండల సీనియర్ నాయకులు రావుల సురేందర్ రెడ్డి పరామర్శించిన ఎమ్మెల్యే జిఎంఆర్

కొత్తకోట, డిసెంబర్ 11(ప్రభాత ఉదయం) కొత్తకోట మండలం కానయపల్లి గ్రామానికి చెందిన మాజీ సింగిల్ విండో చైర్మన్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు రావుల సురేందర్ నాథ్ రెడ్డి ని దేవరకద్ర ఎమ్మెల్యే జిఎంఆర్ పరామర్శించారు. బుధవారం హైదరాబాద్ మెడికవర్ హాస్పిటల్ లో గుండెకు స్టంట్ వేయడంతో బుధవారం ఆస్పత్రిలో సురేందర్ నాథ్ రెడ్డి ని దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.




## గద్వాల జ్యోతిష్యులకు జ్యౌతిష్య ఆచార్య పురస్కారం

గద్వాల జిల్లా ప్రతినిధి, డిసెంబర్ 11(ప్రభాత ఉదయం) తిరుమల తిరుపతి మహతి ఆడిటోరియం లో జరిగిన ఎన్ఎస్ లైవ్ ఆస్ట్రో వారు జరిపిన జ్యౌతిష్య మహా సభ , జ్యౌతిష్య సెమినార్ లో భాగంగా గద్వాల జిల్లా వాసులు వేణుగోపాల రావు కి జ్యౌతిష్య ఆచార్య అవార్డు తో సత్కరించారు.వీరు వ్రాసిన జ్యౌతిష్య ఆర్టికల్స్ నేషనల్ లేవల్ ఎంఏ జిన్ పత్రికలో ప్రచురితం అయ్యాయి.. ఈ సందర్భంగా వేణుగోపాల వారి గురువులు ఛాగాపురం శేషాచార్యులు వివిఎస్ఎన్ఎల్ మూర్తి, శివరంజన్ వారి తల్లిదండ్రులకు క్రృతజ్ఞతలు తెలుపుకున్నారు. ఈ ఘన సత్కారం గద్వాల జ్యోతిష్యులకు రావడం చాలా ఆనందకరమని పలు గద్వాల బ్రహ్మణ పండితులు అభినందనలు తెలిపారు..



## వివాహ వేడుకల్లో పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించిన నాయకులు

కొత్తకోట, డిసెంబర్ 11(ప్రభాత ఉదయం) కొత్తకోట మండల నాయకులు బుధవారం జరిగిన వివిధ వివాహ వేడుకల్లో పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. కొత్తకోట పట్టణంలో మదర్ తెరిసా బైపాస్ దగ్గర ఉన్న ఆనంద్ కన్వెన్షన్ హాల్ నందు బుధవారం కొత్తకోట పట్టణానికి చెందిన చెలిమిళ్ళ లక్ష్మారెడ్డి సోదరుడు చెలిమిళ్ళ పార్వతి రెడ్డి ఏకైక పుత్రిక అయిన అమూల్య వివాహం నవీన్ రెడ్డితో జరిగింది. ఈ వివాహ వేడుకల్లో సి డి సి చైర్మన్ గోల్ల బాబు, పెబ్బేరు మార్కెట్ మాజీ చైర్మన్ గౌని బుచ్చారెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ మూలమల్ల వెంకటేశ్వర్ రెడ్డి,వేముల శ్రీనివాస్ రెడ్డి, ఎల్లంపల్లి నరేందర్ రెడ్డి,దాబా శ్రీనివాస్ రెడ్డి, కొట్టం అమృత్ రెడ్డి, పి మాధవరెడ్డి పాల్గొని ఆశీర్వదించారు.



## క్రీడాకారులను ప్రోత్సహించేందుకే సీఎం కప్

కేటిదొడ్డి, డిసెంబర్11(ప్రభాత ఉదయం)క్రీడాకారులను ప్రోత్సహించాలనే ఉద్దేశంతోనే సీఎం కప్ క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు గద్వాల వ్యవసాయ మార్కెట్ యార్డు చైర్మన్ కుర్వ నల్ల హన్మంతు అన్నారు. మండల స్థాయి సీఎం కప్ క్రీడోత్సవాలను బుధవారం కేటిదొడ్డి మండలం నందిన్నె జెడ్పీహెచ్ఎస్ లో ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడల్లో గెలుపోటములు సహజమని పేర్కొన్నారు. ఓటమికి కుంగిపోకుండా నిరంతరం సాధన చేయాలన్నారు. అప్పుడే విజయాలు సాధ్యమవుతాయన్నారు.ఈ కార్యక్రమంలో ఎంపీఓ, ఎంపిడిఓ కృష్ణమోహన్, ఎంఈఓ, హెచ్ఎం, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.




బిజెపి రాష్ట్ర నాయకురాలు ఉమామహేశ్వరి రెడ్డికి జ్ఞాపికను అందజేస్తున్న అభిలాష్

## బిజెపి రాష్ట్ర నాయకురాలు కె ఉమామహేశ్వర్ రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన స్నేహితురాళ్ళు

రాజేంద్రనగర్, డిసెంబర్ 11(ప్రభాత ఉదయం) రాజేంద్రనగర్ దిల్ పరిధిలోని హైదర్గూడ సిరిమల్లె నగర్ లో బిజెపి రాష్ట్ర నాయకురాలు కొమిరెడ్డి ఉమామహేశ్వర్ రెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. బుధవారం ఆమె స్వగృహంలో స్నేహితులు అభిమానులు ఆమె చేత కేక్ కట్ చేయించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

## చందానగర్ డివిజన్ కాంగ్రెస్ యూత్ అధ్యక్షుడిగా మదు కుమార్ ఎన్నిక



కూకట్‌పల్లి, డిసెంబర్ 11 (ప్రభాత ఉదయం) శేరిలింగంపల్లి నియోజకవర్గం లో ఇటీవల జరిగిన కాంగ్రెస్ పార్టీ యూత్ కాంగ్రెస్ అధ్యక్ష ఎన్నికలలో చందానగర్ 110 డివిజన్ నుండి ఉప్పుటూరి మధు కుమార్ గెలుపొందారు. ఈ సందర్భంగా మధు కుమార్ మాట్లాడుతూ... శేరిలింగంపల్లి నియోజకవర్గం యూత్ కాంగ్రెస్ ఎన్నికలలో చందానగర్ 110 డివిజన్ ప్రెసిడెంట్ గా నా మీద నమ్మకం ఉంచి గెలిపించిన అన్ని వర్గాల యువతి, యువకులు కృతజ్ఞుడనై ఉంటానని మీరు ఇచ్చిన విజయోత్సాహంతో మరింత బాధ్యతాయుక్తంగా నడుచుకుంటానన్నారు.

## తెలంగాణ నూతన రాష్ట్ర ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షులుగా ఏపి జితేందర్ రెడ్డి





ఏపీ జితేందర్ రెడ్డి కి పుష్పగుచ్ఛం అందజేస్తున్న సీనియర్ నాయకులు ఏం భీమ్ రెడ్డి

హైదరాబాద్, డిసెంబర్ 11(ప్రభాత ఉదయం) తెలంగాణ నూతన రాష్ట్ర ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షులుగా ఏపి జితేందర్ రెడ్డి 53 ఓట్లతో గెలుపొందారు. తెలంగాణ ఒలింపిక్ సంఘం ఎన్నికల ఓట్ల లెక్కింపు , ఫలితాల ప్రకటన బుధవారం ఉదయం 10:30 గంటలకు ఎల్బీనగర్ స్టేడియం లోని ఎల్వీఆర్ ఒలింపిక్ భవన్ జరిగింది. తెలంగాణ ఒలింపిక్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కె. జగదీశ్వర్ యాదవ్ ప్రకటించారు.2024-2028 కాలానికి ఎన్నికలు నవంబర్ 21,2024న LVR ఒలింపిక్ భవన్‌లో మధ్యాహ్నం 12:00 నుండి సాయంత్రం 4:00 గంటల వరకు జరిగాయి.అధ్యక్ష పదవికి రాష్ట్ర ప్రభుత్వ మాజీ ఎంపీ, క్రీడా సలహాదారు జితేందర్ రెడ్డి , తెలంగాణ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు వి.చాముండేశ్వరనాథ్ పోటీ పడ్డారు.అర్హులైన 65 మంది ఓటర్లలో 59 మంది ఎన్నికల్లో పాల్గొన్నారు.



## వివాహ వేడుకల్లో నాయకులు

కొత్తకోట, డిసెంబర్ 11(ప్రభాత ఉదయం) కొత్తకోట పట్టణంలో మదర్ తెరిసా బైపాస్ దగ్గర ఉన్న ఆనంద్ కన్వెన్షన్ హాల్ లో నందు బుధవారం కొత్తకోట పట్టణానికి చెందిన చెలిమిళ్ళ లక్ష్మారెడ్డి సోదరుడు చెలిమిళ్ళ పార్వతి రెm xx% ఏకైక Hi icc పుత్రిక అయిన అమూల్య వివాహం నవీన్ రెడ్డితో జరిగిన వివాహంలో నూతన వధూవరులను ఆశీర్వదించడం జరిగింది. సిఈ వివాహ కార్యక్రమానికి సి డి సి చైర్మన్ గోల్ల బాబు, వేముల శ్రీనివాస్ రెడ్డి, ఎల్లంపల్లి నరేందర్ రెడ్డి,దాబా శ్రీనివాస్ రెడ్డి, కొట్టం అమృత్ రెడ్డి, పి మాధవరెడ్డి పాల్గొని ఆశీర్వదించారు.

Printed and Published **MEKALA DAMODAR REDDY** on behalf of DBC Publications, and Printed at Vanitha Graphics, H.No. 3-3-76/123/21, Maruthi Enclave, Attapur, Rajendra Nagar, Ranga Reddy, Telangana-500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally , NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: KOTLA CHANDRA KANTH. "RNI. Title- Code: TELTEL12231**. Cell: 9705231654.